క్లుప్తంగా

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

శ్రీకాళహస్తి: డివిజన్ వ్యవసాయశాఖ తరఫున నియోజకవర్గానికి సంబంధించిన రైతులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన రైతులు, నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ఏడీఏ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం ఎంపీడీఓగా ప్రసాద్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

వరదయ్యపాళెం: ఎంపీడీఓగా పి.ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన బుధవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో పుత్తూరులో ఎంపీడీఓగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు పేర్కొన్నారు. గత ఫిబ్రవరి నెలాఖరున ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు ఉద్యోగ విరమణ చేపట్టారు. అప్పటి నుంచి ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు.

కేంద్ర సహాయమంత్రికి ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి బీజేపీ నేత ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. బండి సంజయ్ కుటుంబ సమేతంగా బుధవారం తిరుమల దర్శనార్థం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప విమానాశ్రయంలో మంత్రిని కలిసి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు.

ఆలయంలో తనిఖీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం తనిఖీలు చేశారు. ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆలయంలో రాహు కేతు మండపాలు, సామగ్రి గది, సెల్‌ఫోన్, లగేజీ సెంటర్, భిక్షాల గాలిగోపురం వద్ద దుకాణాలు నిర్వహిస్తున్న వారితో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దుకాణాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఇక ఆలయంలో భక్తులకు స్వామి అమ్మవార్ల సులభదర్శనం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్‌వీఎస్‌ఎస్ మూర్తి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు ప్రకృతి వ్యవసాయం

పాకాల: ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం ద్వారా నాణ్యమైన పంటలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు రాధాదేవి పేర్కొన్నారు. బుధవారం వల్లివేడు గ్రామంలో ఆత్మ చిత్తూరు వారి సహకారంతో, జిల్లా వనరుల కేంద్రం అధికారులు రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రాధాదేవి మాట్లాడుతూ వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయంలో అధికారుల సూచనలు పాటించడం ద్వారా పంట దిగుబడుల్లో నష్టాలు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. అనంతరం రైతులు తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. జిల్లా వనరుల కేంద్రం తిరుపతి సిబ్బంది ఏఓ పుష్పావతి, స్థానికులు పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తం

చంద్రగిరి: అతిసారంపై అప్రమత్తంగా వ్యవహరించాలని చంద్రగిరి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూచించారు. బుధవారం చంద్రగిరిలోని ప్రభుత్వ హాస్టల్స్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అతిసారం ప్రబలుతోందని, ప్రతి ఒక్క హాస్టల్ వార్డన్ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు తాగేందుకు ఇవ్వాలన్నారు. అనంతరం హాస్టల్ విద్యార్థుల వివరాలను పరిశీలించారు. సిబ్బంది శ్యామల, వాసుదేవ, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సిగరెట్లు విక్రయిస్తే జరిమానా

తిరుపతి క్రైమ్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు, బీడీలు విక్రయించే వారికి పోలీసులు బుధవారం జరిమానా విధించారు. పాఠశాలలు, కళాశాలలు విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాల్లో సిగరెట్లు, బీడీలు విక్రయించకూడదన్నారు. ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే హెచ్చరిక లేకుండా సిగరెట్, బీడీలు అమ్ముతున్న దుకాణాదారులకు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.200 జరిమానా విధించారు.

గుండెపోటుతో టైంస్కేల్ ఉద్యోగి మృతి


తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంసీఏ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టైంస్కేల్ ఉద్యోగి వెంకటరమణ(56) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మృతికి టైంస్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సహచర సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

పడకేసిన పారిశుద్ధ్యం


ఆలయ ఆవరణలో మురుగునీటి గుంట


సీసీ రోడ్డు పక్కన నిల్వ ఉన్న మురుగునీరు

- గ్రామంలోని వీధుల్లో రోడ్లపైనే మురుగునీరు
- ప్రబలుతున్న వ్యాధులు
- పట్టించుకోని అధికారులు


మురుగుతో నిండిన డ్రైనేజీ కాలువ


చేతిపంపు చుట్టూ నిల్వ ఉన్న మురుగు

బుచ్చినాయుడుకండ్రిగ: కుక్కంబాకంలో పారిశుద్ధ్యం పడకేసింది. రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా ప్రజలు డయేరియా, మలేరియ, టైఫాయిడ్, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్ బారిన పడకుండా చూడాలని ఆదేశించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదు. వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రా మాల్లో ఎలాంటి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టలేదనడానికి మండలంలోని కుక్కంబాకం గ్రామాన్ని సందర్శిస్తే చాలు. ఈ గ్రామంలో పారిశుద్ధ్యం పడకేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మురుగునీరు నిల్వ ఉంది. కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిండిపోయి రోడ్ల మీదకు వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గ్రామస్తులు ముక్కులు మూసుకుని వెళ్తున్నారు. వర్షం పడితే గ్రామంలోని పలు వీధుల్లో గుంతల్లోకి వర్షపు నీరు చేరి బురదమయం అవుతున్నాయి. మురుగునీటి వల్ల దోమలు విపరీతంగా ఉండడంతో జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామని పలువురు వాపోతున్నారు. తాగునీటి చేతిపంపులకు ప్లాట్‌ఫాంలు లేకపోవడంతో వాటి చుట్టూ అపరిశుభ్రత నెలకొంటోంది. నీటిని తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు పలువురు మహిళలు చెబుతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా పేడదిబ్బలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో బోర్డు ఏర్పాటు


బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో రాజశేఖర్

ఏర్పేడు: మండలంలోని వికృతమాల రెవెన్యూ మర్రిమంద హౌసింగ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు బుధవారం బోర్డు ఏర్పాటు చేశారు. మర్రిమంద హౌసింగ్ కాలనీలో సర్వే నంబర్లు 132, 133లో సుమారు ఎకరా ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవల కొంతమంది స్థానికులు భూములను ఆక్రమించేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న సీపీఎం నాయకులు సమస్యను తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ రాజు దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో రాజశేఖర్ ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగయ్య, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సారె సమర్పణ


సారె సమర్పిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ కొండపై ఉన్న గంగమ్మకు బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారె సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా అనవాయితీగా అమ్మవారికి సారె సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనమాల గురవయ్య, సురేష్, రాజా, సుబ్రహ్మణ్యం, రమణారెడ్డి, విజయ్, షఫీ, అనసూయమ్మ, గంగమ్మ, రాణి, గరికపాటి చంద్ర, రమేష్, ధన, మస్తాన్,శీను, ప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పందుల పెంపకందారులకు నోటీసులు


నోటీసులు అందజేస్తున్న పురపాలక సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణ పరిధిలో ఉన్న పందుల పెంపకందారులకు పురపాలక సంఘం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో పందుల సంచారం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంచుకోవాలన్నారు. 14వ తేదీ లోపు తరలించాలన్నారు. లేకపోతే పందులను పట్టి దూరప్రాంతాల్లో తరలిస్తామని తెలిపారు.

కొత్త చట్టాలు రద్దు చేయండి

తిరుపతి అర్బన్: కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నేతలు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఒక విషయంపై చట్టం చేయాలన్నా లేక ఉన్న చట్టంలో సవరణ చేయాలన్న ప్రభుత్వం ముందుగా లా కమిషన్ ఆఫ్ ఇండియాను సంప్రదించాలని చెప్పారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, వేణుగోపాల్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తంజావూరు మురళి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి


విద్యార్థులతో పాఠాలను చదివిస్తున్న డీఈఓ శేఖర్

ఏర్పేడు: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలని డీఈఓ శేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీ ద్వారా బోధించే విధానాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన అమలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడించారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. సీ,డీ గ్రేడ్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాలన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభరీతిలో బోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరాజు, ఉపాధ్యాయులు నిర్మల, మాధవి, సీఆర్పీ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు, కార్మికులు

పాకాల: ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకుడు మధుసూధన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులతో కలసి ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని కోరారు. అనంతరం డీటీ పరదేశికి వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ ప్రసాద్, రైతు నేత కేశవరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు సుగుణమ్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు షకీల, షఫియా, భాను, మమత, మరియాంబి పాల్గొన్నారు.

ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఆయనకు ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

12న ధ్వజారోహణం

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు 12వ తేదీ శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. 13న పాండవ విద్యాభ్యాసం, 14న బకాసుర వధ, 16న ద్రౌపదీ కల్యాణం, 19న అర్జున తపస్సు, 21న దుర్యోధన, దుశ్శాసున వధ, అగ్నిగుండ ప్రవేశం, 22న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 24న పార్వేట ఉత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

పరిశుభ్రమైన నీటిని అందించాలి


ట్యాంకులను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

- కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: నగరంలోని ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళం, అలిపిరి వద్దనున్న వాటర్ ఫిల్టర్ ప్లాంట్లను, మున్సిపల్ పార్కు, లీలా మహల్ సమీపంలోని నీటి సరఫరా ట్యాంకులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కల్యాణి డ్యాం నుంచి నీటి పంపింగ్ తోపాటు ఫిల్టర్ చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ రోజూ నీటి సాంద్రత పరీక్షలు తప్పకుండా నిర్వహించాలన్నారు. అలాగే అన్ని ట్యాంకులను నిర్ణీత సమయంలో శుభ్రం చేసి నీటిని నింపి సరఫరా చేయాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు శ్రావణి, తేజస్విని పాల్గొన్నారు.

శ్రీస్వప్న వారాహిదేవి అలంకరణలో అమ్మవారు


స్వప్నవారాహీ దేవికి పూజలు చేస్తున్న మాతాజీ

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న వారాహి నవరాత్రుల్లో భాగంగా ఆలయంలో కొలువైన శ్రీ శ్వేత వారాహిదేవి అమ్మవారు బుధవారం శ్రీస్వప్న వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతి పీఠంలో కొలువైన వారాహీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య పూజలు ప్రారంభించారు. వేదపండితులు మంత్రాలతో హోమం చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గజవాహనంపై పరాశరేశ్వరస్వామి


గజవాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం సాయంత్రం స్వామి వారు గజవాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజలు, పరివార దేవతలకు అభిషేకాలు చేసి, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు వితరణ చేశారు. సాయంత్రం శుద్ధి, తోమాల, నైవేద్యాలు అందుకున్న ఉత్సవర్లు వివిధ సుగంధ పుష్ప మాలికలను, స్వర్ణాభరణాల అలంకరణలో గజ వాహనంపై నుంచి భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారికి హారతులు పట్టారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేందర్, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయానికి చెక్క రథం లేని కారణంగా సర్వభూపాల వాహనసేవను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. సోమవారం సాయంత్రం 7 గంటలకు ఆలయంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామికి జరిగే అర్జిత కల్యాణోత్సవంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనాలని ఆయన కోరారు.

మానవ మనుగడకు వృక్షాలే ఆధారం


విద్యార్థులకు ఔషధ మొక్కలను పంపిణీ చేస్తున్న మర్ధాల రవిబాబు

రేణిగుంట: మానవుని మనుగడకు వృక్షాలే ఆధారమని ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్ధాల రవిబాబు అన్నారు. మండలంలోని గుత్తివారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పర్యావరణం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమస్య ప్రపంచ దేశాలన్నింటిలోనూ ఉందన్నారు. పర్యావరణ సమస్య పరిష్కారానికి విరివిగా చెట్లను పెంచడమే మార్గమన్నారు. తల్లి మనకు జీవం పోస్తే చెట్లు మనకు జీవితాన్ని ఇస్తున్నాయని, చెట్లు ఎంతో అవసరమని మనం పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి శుభ దినాల్లో మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలన్నారు. భావిభారత పౌరులుగా మీరు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలన్న లక్ష్యంతో విద్యార్థులకు ఔషధ మొక్కలు పంపిణీ చేసి, పాఠశాల ఆవరణలో నాటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రాజశేఖర్, సుబ్బారెడ్డి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


రేణిగుంటలో సీడీపీఓ కృష్ణమంజరికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రేణిగుంట: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్దకు అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీగా చేరుకుని సీడీపీఓ కృష్ణమంజరికి వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు గ్రాట్యుటీ, ఇతర అలెవెన్సులు అందజేయాలని కోరారు. రావాల్సిన పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇప్పించాలని, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. యూనియన్ అధ్యక్షురాలు భాగ్య, ధనమ్మ, విజయ, పాండురంగమ్మ, అంబిక, రేవతి, శారద, లీల తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నారాయణవనం: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, తమకు కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లించాలని, 42 రోజుల పాటు చేసిన సమ్మెలో భాగంగా ప్రభుత్వంతో కుదుర్చుకున్న మినిట్స్ ఒప్పందాన్ని తక్షణం అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఉపసంహరించి, అన్నింటికీ ఒకే యాప్‌ను వినియోగంలోకి తీసుకురావాలని యూనియన్ నాయకులు నాగభూషణమ్మ, జయసుధ తదితరులు విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ శంకరరావుకు వినతిపత్రం అందజేశారు.

శిల్పారామంలో హస్తకళా మేళా


మేళాను ప్రారంభిస్తున్న ఏఓ ఖాదర్‌వల్లీ

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో చేనేత, హస్తకళల మేళాను నిర్వహిస్తున్నట్లు ఏఓ ఖాదర్‌వల్లీ తెలిపారు. తిరుపతి సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం చేనేత, హస్తకళా మేళాను ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ నెల రోజులు పాటు జరిగే ఈ మినీ మేళాలో వివిధ రాష్ట్రాల నుంచి 27 మంది కళాకారులు తమ ఉత్పత్తులను అమ్మకం కోసం అందుబాటులో ఉంచారన్నారు. తిరుపతి నగర ప్రజలు చేనేత, హస్తకళలను ఆదరించాలని కోరారు. సెక్రటరీ సంస్కృతి కల్చరల్ క్రాఫ్ట్ సొసైటీ నిర్వాహకుడు మహేష్, కళాకారులు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

బడి బయట పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న ఓఎస్‌సీ రాష్ట్ర సలహాదారురాలు

చంద్రగిరి: చదువుకు దూరంగా బడిబయట ఉన్న పిల్లల భవిష్యత్తుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఓఎస్‌సీ రాష్ట్ర సలహాదారురాలు గీత అన్నారు. మండల పరిధిలోని చంద్రగిరి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, మిట్టపాలెం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు విద్యపై ఆరా తీశారు. అనంతరం మిట్టపాలెంలోని ఐదుగురు బడి బయట పిల్లలకు ప్రభుత్వం అందించిన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఆమె వెంట తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సురేష్, ఏఎల్‌ఎస్‌సీఓ శ్రీధర్, ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్‌బాబు, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, శ్యామల, గౌరీ, గురుప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.